ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024 5
అనంతపురం





అనంతపురంలో ర్యాలీ చేస్తున్న అఖిల భారత రైతు కార్మిక సంఘాల నాయకులు

రైతాంగం బాగుండాలంటే..
మోడీని గద్దె దించాలి

- అనంతలో నినదించిన అఖిల భారత రైతు, కార్మికసంఘాలు
- ర్యాలీ, టవర్ క్లాక్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్నదాతలను విస్మరించి కార్పొరేట్ పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ఆయనకు వంత పాడుతున్న పార్టీలను గద్దె దింపితేనే రైతులకు రక్షణ లభిస్తుందని అఖిలభారత రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతాంగం చేపట్టిన చలో ఢిల్లీకి మద్దతు తెలియజేస్తూ కార్మిక, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో అనంతపురంలో గురువారం ఉదయం నిరసన ర్యాలీ చేపట్టారు. లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ కొనసాగింది. టవర్‌క్లాక్ వద్ద బైఠాయించి రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, చెన్నప్ప యాదవ్, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కిష్ట, రాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు మాట్లాడుతూ బిజెపిని అధికారంలోకి తీసుకుని వస్తే రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టం తెస్తామని 2014కు ముందు నరేంద్ర మోడీ హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఇదే డిమాండ్ మీద రైతులు సంవత్సరాల తరబడి పోరాడుతుంటే మోడీ రైతులను దేశద్రోహులు, ఖలిస్తాన్ ఉగ్రవాదులంటూ అవమాన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కాలంలో 1.60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే అన్నదాతల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఓ వైపు రైతుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే కార్పొరేట్ల ఆస్తులు మాత్రం వేలరెట్లు పెరిగి ప్రపంచ కుబేరులుగా మారుతున్నారని తెలియజేశారు. రైతులపై మోడీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అడ్డుకోవాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీ భజన చేయడం సిగ్గుచేటన్నారు. మోడీకి వంతపాడుతున్న ఇలాంటి పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీసం మద్దతుధర చట్టం చేయాలన్నారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26వేలు చేయాలన్నారు. ఉపాధిహామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, పంట నష్టం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. కేరళ ప్రభుత్వం తరహా రైతులకు రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎటిఎం నాగరాజు, తిరుమలేష్, భగత్ సింగ్ ఆటోవర్కర్స్ యూనియన్ ఆదినారాయణ, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, రైతుసంఘం నాయకులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మరో రెండు ఖరారు

- ఇద్దరు అభ్యర్థులను ప్రకటించిన టిడిపి
- కదిరికి కందికుంట వెంకట ప్రసాద్ భార్య యశోదాదేవి
- పుట్టపర్తికి 'పల్లె' కోడలు పల్లె సింధూర



కందికుంట యశోదా దేవి
కదిరి నియోజకవర్గం



పల్లె సింధూర
పుట్టపర్తి నియోజకవర్గం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను గురువారం నాడు విడుదల చేసింది. ఈ జాబితాలో సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల అభ్యర్థులను ఆ పార్టీ ఖరారు చేసింది. ఈ జాబితాలో స్వల్ప మార్పులు కన్పించాయి. కదిరి సీటు కందికుంట వెంకట ప్రసాద్‌కు అని భావిస్తుండగా ఆయన భార్య కందికుంట యశోదాదేవికి ఇచ్చారు. అదే విధంగా పుట్టపర్తి సీటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కాకుండా ఆయన కోడలు పల్లె సింధూరకు ఇచ్చారు. రెండో జాబితాలో ప్రకటించిన రెండు పేర్లు కూడా మహిళలకే ఇవ్వడం గమనార్హం. దీంతో టిడిపి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 11 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ధర్మవరం బిజెపికి పొత్తుల్లో భాగంగా ఇచ్చారు. అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ పోటీలో ఉండనున్నారు. ఈ మేరకు ఆయన ప్రచారాన్ని గురువారం నుంచి ప్రారంభించారు. ఇవి పోను రెండు అసెంబ్లీ స్థానాలు పెండింగులోనున్నాయి. అనంతపురం, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మినహా తక్కిన అసెంబ్లీ నియోజకవర్గాలన్నీ టిడిపి అభ్యర్థులను ప్రకటించినట్లు అయ్యింది. పెండింగ్‌లో ఉన్న రెండింటిలోనూ అనంతపురం అర్బన్ నియోజకవర్గం పొత్తుల్లో జనసేనకు అని ప్రచారం జరిగినా ఆ అవకాశం లేదన్న చర్చ నడుస్తోంది. టిడిపినే ఈ స్థానం నుంచి కూడా పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇక గుంతకల్లుకు వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అభ్యర్థుల పేర్లు ప్రకటించిన రెండు చోట్ల గ్రూపులున్నాయి. మాజీ ఎమ్మెల్యేలు అనంతపురానికి ప్రభాకర్ చౌదరి, గుంతకల్లు జితేందర్ గౌడ్‌లు మరోమారు తమకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో మార్పులు చేపడితే ఏ రకంగా సర్దుబాటు చేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారధికి స్థానం సర్దుబాటు చేయాల్సి ఉంది. పెనుకొండ టిక్కెట్టు సవితకు కేటాయించాక ఈయనకు ఎక్కడ నుంచి పోటీ చేయించే అవకాశం కల్పిస్తారన్న చర్చ నడుస్తోంది. అదే విధంగా పొత్తులో ధర్మవరం బిజెపికి వెళ్లితే అక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ పరిస్థితి ఏమిటన్నది కూడా చర్చ నడుస్తోంది. టిక్కెట్టు దక్కకుండా మిగిలిన వారిలో కళ్యాణదుర్గం నుంచి హనుమంతరాయ చౌదరి కుటుంబం ఉంది. వీరందరికీ ప్రత్యామ్నాయం ఏమి చూపనున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టిడిపి ఇప్పటి వరకు రెండు పార్లమెంటు స్థానాలకూ అభ్యర్థులను ఖరారు చేయలేదు. హిందూపురం పార్లమెంటు బిజెపికి పొత్తుల్లో ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ ఆ పార్టీ అధిష్టానంలో జరిగిన చర్చల్లో ఈ అంశం ముందుకు రానట్టు తెలుస్తోంది. దీంతో రెండు పార్లమెంటు స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులను బరిలో దింపాల్సి ఉంటుంది. ఈ స్థానాల్లో పాత వారినే ప్రకటిస్తుందా... లేక కొత్త మార్పులతో కొత్త వారికి అవకాశం కల్పిస్తుందా..? అన్నది చూడాల్సి ఉంది. మూడో జాబితా సమయానికి మిగిలిన రెండు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా అభ్యర్థుల ఖరారు తదుపరి వస్తున్న అసంతృప్తులను టిడిపి ఏ రకంగా చల్లార్చి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమయత్తం చేస్తుందన్నది చూడాల్సి ఉంది.

విద్యార్థులను హాస్టల్ ఖాళీ చేయించొద్దు

ఎస్‌కెయు విసికి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల బలగాల కోసం విద్యార్థులు ఉంటున్న హాస్టళ్లను ఖాళీ చేయించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌కెయు ఇంజనీరింగ్ విద్యార్థులను హాస్టల్‌ను ఖాళీ చేయించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వైస్‌ఛాన్స్‌లర్ హుస్సేన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకు మునుపు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సిద్ధు, ఎస్కెయు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, వంశీ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు రానున్న కేంద్ర బలగాల కోసం ఎస్‌కెయులో ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్న తుంగభద్ర బ్లాక్-2 హాస్టల్లో విద్యార్థులను ఖాళీ చేయించారని తెలిపారు. ఖాళీ చేయించిన విద్యార్థులను పాడుబడిన గంగ హాస్టల్లోకి పంపించాలని యాజమాన్యం చూస్తోందన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం అలాగే ప్రవర్తించి హాస్టల్స్ ఖాళీ చేయిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు ఎస్ఎఫ్ఐ కమిటీ నాయకులు చంద్ర నాయక్, మోహన్, బండేష్, సండే, గణేష్, రవి ప్రకాష్, ఇంజనీరింగ్ విద్యార్థులు సూర్య, గణేష్ నాయక్, హరీష్ నాయక్, నందు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ చరిత్రను మలుపుతిప్పిన 'మార్క్స్'

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నాయకులు



కార్ల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రపంచ మానవజాతి చరిత్రను మలుపుతిప్పిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్ అనిసిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్ర, 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి కొనియాడారు. మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఎన్టీఆర్ ఆటోస్టాండ్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ ఏంగిల్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రచించి ప్రపంచలోని కమ్యూనిస్టు పార్టీలకు ఒకమార్గాన్ని చూపారన్నారు. 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అని రెండు వందల సంవత్సరాల క్రితమే మార్క్స్ చెప్పాడంటే ఆయన మేథస్సు ఎంత గొప్పదో తెలుస్తుందన్నారు. ఇప్పటికీ ప్రపంచ దేశాల్లో ఎక్కడ ఆర్థిక సంక్షోభం వచ్చినా పెట్టుబడిదారులు మార్క్స్ రచించిన దాస్ క్యాపిటల్‌ను చదివి దాని సారాంశాన్ని వంత పట్టించుకుంటున్నారని వివరించారు. ప్రస్తుత దుర్మార్గపు దోపిడీ వ్యవస్థ, సమర్థకులు, మార్క్సిజం మరణించిందని వాదిస్తున్నా ఇప్పటికీ ప్రపంచంలోని కోట్లాది కార్మికులు, పీడిత, తాడిత వర్గాలు, బడుగు, బలహీన వర్గాలు తమ విముక్తి కోసం మార్క్సిజం గురించి చర్చిస్తున్నారన్నారు. 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అన్న నినాదంతో కార్మిక వర్గాన్ని ఉర్రూతలు ఊగించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎన్టీఆర్ శ్రీనా, ప్రకాష్, వెంకటనారాయణ, ఎటిఎం నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్, భీమేష్, భగత్‌సింగ్ ఆటోడ్రైవర్ యూనియన్ నాయకులు శివ, సోమప్ప, భాస్కర్, రామకృష్ణ, రామాంజనేయులు, ప్రసాద్, హరి, శీనా, ఠాగూర్, వీరాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

నార్పల : ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ సర్కిల్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎపిఎం తిప్పమ్మ, సూపర్‌వైజర్లు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడుతో ప్రభుత్వ విప్ 'కాపు'



కుటుంబ సభ్యులతో కలిసి వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం : భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. కాపు రాజకీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో వెంకయ్యనాయుడును కలవడం ప్రాధాన్యత సంతరించు కుంది.

గెలిపిస్తే కళ్యాణదుర్గం రూపురేఖలు మారుస్తా

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



వైఎస్ఆర్ చేయూత చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపి రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రమంతా కళ్యాణదుర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపుతానని నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపి తలారి రంగయ్య పేర్కొన్నారు. కుందుర్పి ఎంపిడీవో కార్యా లయ సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి నాల్గో విడత వైఎస్ఆర్ చేయూత చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాగు, తాగునీరు తీసుకు రావడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే కళ్యాణదుర్గం రూపురేఖలు మారుస్తాన ని తెలిపారు. నియోజవర్గ వ్యాప్తంగా వైఎస్ఆర్ చేయూత ద్వారా రూ. 150 కోట్లు మహిళలకు అందిం చామన్నారు. అభివృద్ధికి రూ. 2,140 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఎంపి నిధుల ద్వారా రూ. 350 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తాగునీటి కోసం 56 గ్రామాల్లో బోర్లు వేయించా మన్నారు. నాల్గో విడత కింద కుందుర్పి మండలానికి రూ. 6,84,37,500 చెక్కును పంపిణీ చేశారు. బాధితుల కు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కుందుర్పి, జంబుగుంపల గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బికె భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, మం డల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి, వైస్ ఎంపీపీలు భీమిరెడ్డి శ్రీలక్ష్మి, అజయ్‌బాబు, ఎంపీటీసీ గంగమ్మ, హనుమంతరాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూరురెడ్డి, రాము పాల్గొన్నారు.

చెక్‌పోస్టు గేట్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనాలు



విరిగిపోయిన సరిహద్దు గేట్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో ఆంధ్ర-కర్నాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గేట్‌ను గురువారం గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టడంతో 20 మీటర్ల దూరంలో పడింది. చెక్‌పోస్టు గేట్‌ను జిందాల్‌కి వెళ్లే టిప్పర్లే ఢీకొట్టి ఉంటాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా సరిహద్దు గేట్‌ను ఢీకొన్నది నిజమే, ఎవరి వాహనం, ఎందుకు అనేది విచారణ తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. కాగా జిందాల్ ఫ్యాక్టరీకి చెందిన వాహనాలు రాత్రి, పగలు తేడా లేకుండా అతివేగంతో అధిక టన్నేజీతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ఇప్పటికే రాత్రివేళ ఇద్దరు వృద్ధులను ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగి అంగవైకల్యం పొందారు. మూగ జీవాలు సైతం బలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్ ముందే తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఓ టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహిళ నేటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జిందాల్ టిప్పర్లు తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నా స్థానిక ప్రభుత్వ అధికారులు కానీ జిందాల్ యాజమాన్యం కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి జిందాల్ టిప్పర్లను నియంత్రిం చాలని మండల వాసులు కోరుతున్నారు.

గ్రూప్-1లో అవకతవకలపై విచారించాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.బాలకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2018 గ్రూప్.1 మెయిన్స్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు చెప్పడమే ఇందుకు నిదర్శమన్నారు. దాదాపు 49 వేల ఓఎంఆర్ షీట్లలో ముల్యాకంనాల్లో అవకతవకలు ఏర్పడ్డాయని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్స్ పరీక్షనే రద్దు చేసిందన్నారు. పెద్ద కుంభకోణంలో పెద్దల హస్తం లేనిదే ఇలా జరిగి ఉండదన్నారు. కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గి పరీక్షలు రాస్తే ఇలాంటి చర్యలు నిరుద్యోగుల భవిష్యత్తుపై పడి బలవన్మరణాలకు దారి తీస్తుందన్నారు. ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణలో పూర్తి వైఫల్యం స్పష్టం అవుతోందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం అరునెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలు అమ్ముకుంటున్న వైసిపి నాయకులు

బుక్కరాయసముద్రం : నియోజకవర్గవ్యాప్తంగా వైసిపి నాయకులు ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆరోపించారు. అనంతపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉందన్నారు. అదేవిధంగా ఇప్పుడు ఒక్కొక్క ఉద్యోగానికి రూ.కోటి నుంచి రూ.3కోట్ల వరకూ అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో 2018లో 31న 162 గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019లో పరీక్షలు నిర్వహించి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. సంప్రదాయంగా నిర్వహిస్తున్న మాన్యువల్ మూల్యాంకనం కాకుండా తమ వారికి ఉద్యోగాలను కట్టబెట్టేందుకు ప్లాన్ చేసి మరీ డిజిటల్ వాల్యూవేషన్ చేశారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ ఎం.గౌతమి



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఉరవకొండ

సాధారణ ఎన్నికలు-2024 నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌ల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్, ఇవిఎం కమిషనింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోసం అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్, ఇవిఎం కమీషనింగ్ కోసం త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లో పెయింటింగ్ పనులు పూర్తి కావాల్సి ఉందని, వెంటనే పనులు పూర్తి చేయాలని డిఇఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఈఆర్ఓ శిరీషా, గుంతకల్లు ఆర్‌డిఒ వి.శ్రీనివాసులురెడ్డి, డిఇఒ వరలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా తిమ్మప్ప



తిమ్మప్పను అభినందిస్తున్న మాజీ సైనికోద్యోగులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా తిమ్మప్ప నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం నగరంలోని కోవూర్‌నగర్‌లో ఉన్న సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సైనికుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు డి.షేకన్న, ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప మాట్లాడుతూ దేశానికి సేవలందించిన మాజీ సైనికులు, యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన మాజీ సైనికుల భార్యలైన వీరనారిమణులు, వితంతువులకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. గతంలో కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సైనిక సంక్షేమాధికారిగా సేవలందించిన అనుభవం ఉందన్నారు. కాగా ఈనెల 22వ తేదీ వరకూ అగ్నివీర్‌గా సైన్యంలో చేరడానికి అప్లయ్ చేయడానికి సమయమున్నందున ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, జంగంశెట్టి సురేష్, అబ్దుల్‌ఖాదర్, ఈ.రంగారెడ్డి, బి.ఎ.హుస్సేన్, నాగరాజు, ఇస్మాయిల్ షఫీ, వెంకటరమణారావు, గొల్ల ఈశ్వరయ్య, అల్లాబక్షు, జగన్మోహన్‌నాయుడు, ఆఫీస్ స్టాఫ్ గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విపక్షాలన్నీ ఏకమైనా వైసిపిని ఓడించలేవు..

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా

ప్రజాశక్తి-నార్పల

ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా ఈసారి వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడించలేవని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని దుర్గం, సిద్ధరాచెర్ల, బోయకొట్టాల, గొల్లపల్లి, బండ్లపల్లి, మాలవాండ్లపల్లి, బొమ్మకుంటపల్లి, పప్పూరు, మంగపట్నం, సోదనపల్లి, గుంజేపల్లి, నల్లపరెడ్డిపల్లి, గంగనపల్లి, ముచుకుంటపల్లి, గూగూడు, నడింపల్లి గ్రామాల్లో వైసిపి నాయకులు పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చే ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి గద్దెనెక్కేందుకు ప్రజల్లోకి వస్తున్నాయన్నారు. వాటిని నమ్మకుండా సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూపి రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా హెచ్.సోదనపల్లిలో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, పి.బండమీద పల్లెలో అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాలు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

పౌష్టికాహార పక్షోత్సవం

అనంతపురం : భార్మప్ప వీధి అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సిడిపిఒ లలిత, సూపర్‌వైజర్ విష్ణువర్ధని మాట్లాడుతూ ఆకుకూరలు తినడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల చిరకాలం జీవించవచ్చన్నారు. పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయభారతి, లక్ష్మీనరసమ్మ, మాధవీలత, సుమంగళి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బాల్య వివాహాలను అరికడదాం

ఆత్మకూరు : బాల్య వివాహాలను ఆపి బాల్యాన్ని రక్షిద్దామని బాలల పరిరక్షణ అధికారి జి.చంద్రకళ పిలుపునిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ బిఎన్.శ్రీదేవి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల్య వివాహాలు నిలుపుదల, బాలలపై జరిగే లైంగిక దాడులు నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు సమాజానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయన్నారు. కావున మనమందరం సమిష్టిగా బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్, పోలీస్ హెల్ప్ లైన్, ఉమెన్స్ లైన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తే 1098 హెల్ప్‌లైన్‌కు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్రీవాణి, లావణ్య, కేజీబీవీ ఎస్ఓ లీమా రోస్, జిల్లా బాలల పరిరక్షణ సమితి విభాగం నుంచి కౌన్సిలర్ సంధ్య, కెజిబివి సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు రూ.లక్ష వితరణ

అనంతపురం : నగరంలోని మెడికల్ కళాశాల పురోగతికి రూ.లక్ష వితరణ చేసినట్లు ప్రముఖ మానసిక వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల మానసిక శాస్త్ర పూర్వ విభాగాధిపతి డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ తెలిపారు. కళాశాలలోని వైద్య విద్యను పూర్తి చేసి 19వ స్నాతకోత్సవంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందిన డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ కుమారుడు డాక్టర్ ఎండ్లూరి చిద్విలాస్ చదువుకున్న కళాశాల అభివృద్ధి కోసం ప్రిన్సిపల్ ఛాంబర్‌లో రూ.లక్ష చెక్కును ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యాలావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శంషాద్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎండ్లూరి ప్రభాకర్

రాక్షస పాలనను అంతమొందిద్దాం : శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

రాష్ట్రంలో సిఎం జగన్ రాక్షస పాలనను అంతమొందించడానికి మేము సంసిద్ధంగా ఉన్నామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలను ఓ దీక్షలా తీసుకుని జగన్ పాలనను దించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో దొంగ ఓట్ల కారణంగా యల్లనూరులో వైసిపికి అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. అందుకే ఈసారి దొంగ ఓట్లను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. జగన్ చేపట్టిన 'సిద్ధం' సభలన్నీ అబద్ధపు సభలుగా మారాయన్నారు. గ్రీన్‌మ్యాట్ వేసి జనాలు ఉన్నట్లు మార్ఫింగ్ చేసి తన మీడియా ద్వారా ఊదరగొడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జనసేన నాయకులు ఈశ్వర్, సాకే మురళీకృష్ణ, టీడీపీ నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, గోవర్ధనరాజు, రామమునిరెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, నారాయణస్వామి, వెంకట్రామిరెడ్డి, రామచంద్రనాయుడు, రవికుమార్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

సస్యరక్షణ పద్ధతులతో పంటలకు రక్షణ

హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రావు

ప్రజాశక్తి-గార్లదిన్నె

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చని హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని పెనకచెర్ల, ముకుందాపురం, ఎర్రగుంట్ల గ్రామాల్లో సాగు చేసిన పండతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ, నిమ్మతోటల్లో వచ్చే వేరుకుళ్లు తెగులు, ఎండు తెగులు, పులుసు పురుగు, బంక కారడం వంటి సమస్యల కోసం రైతులు సకాలంలో సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలన్నారు. దీనికితోడు అధికారుల మెళకువలు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. వేరుకుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతులు నీటితడులు డ్రిప్ ద్వారా కాండానికి తగలకుండా వేరుకు మాత్రమే అందించాలన్నారు. పశువుల ఎరువులో ట్రైకోడెర్మావిరిది, సుడోమోనాస్, వేపచెక్క సమపాళ్లలో కలిపి చెట్టుకు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నరసింహారావు, మండల హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్, ఉరవకొండ హెచ్ఓ నెట్టికంటయ్య, రైతులు పాల్గొన్నారు.




వేరుకుళ్లు తెగులుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

'చలో ఢిల్లీ'కి మద్దతుగా నిరసన

ప్రజాశక్తి-పామిడి

మార్చి 14న రైతుసంఘాలు పిలుపునిచ్చిన చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా రైతుసంఘం మండల కార్యదర్శి ముత్యాలు, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 540 రైతుసంఘాలతో కూడిన సంయుక్త కిసాన్‌మోర్చా ఈనెల 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పిలుపునిచ్చిందన్నారు. ఈ సభకు మద్దతుగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు గొంతెత్తి నినదించాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబర్ లో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీ బయలుదేరిన రైతన్నలను హర్యానా సరిహద్దుల్లో అడ్డగించడం అన్యాయమన్నారు. బిజెపి ప్రభుత్వం రైతాంగంపై కర్కశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాలుగు సార్లు చర్చలు జరిపినా పురోగతి సాధించలేదన్నారు. మంత్రులు ఇతర విషయాలు చర్చిస్తున్నారే తప్ప మద్దతు ధరల చట్టం గురించి మాట్లాడడం లేదన్నారు. రైతులు కోరుతున్న మద్దతు ధరల చట్టం చేస్తే ప్రభుత్వంపై రూ.లక్షలు కోట్ల ఆర్థిక భారం పడుతుందని అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ఆర్థిక నిపుణులు ఇది నిజం కాదని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. రద్దు చేసిన నల్లచట్టాల విధానాలనే అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎరువులపై రాయితీల్లో కోతలు విధించడం, ఆహార భద్రతా చట్టం అమలులో కోత విధించి కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. భూహక్కు చట్టాన్ని ఉపసంహరించాలని, చుక్కల భూములు, బంజర భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, రైతుసంఘం నాయకులు ఈశ్వరయ్య, కిష్టప్ప, బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఎమ్మెల్యే కేశవ్

అనంతపురం : ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తూ పయ్యావుల కేశవ్ రూ.2కోట్ల చీరలు పంపిణీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పయ్యావుల కేశవ్ ఇప్పటి వరకూ దొంగ ఓట్లు, అక్రమంగా ఓట్లు చేర్చడం లాంటి చర్యలతో ఉరవకొండలో గెలుస్తున్నారని మండిపడ్డారు. పిఎసి ఛైర్మన్‌గా అక్రమంగా సంపాదించిన సొమ్ము ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకరనారాయణ మాట్లాడుతూ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఉరవకొండలో ఈసారి కేశవ్ గెలవలేరన్నారు. డబ్బులు ఉన్న ఎన్‌ఆర్‌లు, బడా కాంట్రాక్టర్లకు టిడిపి టికెట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎస్.మాసూంబాషా ఆదేశాల మేరకు మండలంలోని ముట్టాల గ్రామం ఇందిరమ్మ కాలనీలో దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ముట్టాల గ్రామం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న సత్రసాల శివశంకర్ ప్రసాద్ ఇంట్లో నిల్వ ఉంచుకున్న 12 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.24, 200 ఉంటుందన్నారు. నిందితుడు శివశంకర్‌ను అదుపులోకి తీసుకుని బియ్యాన్ని తహశీల్దార్‌కు అప్పగించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అధికారులు పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, వాసుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటజూదరులు అరెస్టు

ఆత్మకూరు : మండల పరిధిలో సింగంపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడి చేసి పేకాటజూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పక్కాగా అందిన సమాచారం పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని రూ.1,09,000 నగదు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టుకి హాజర పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొమ్మనహాల్ : మండలంలోని లింగదహాల్ గ్రామ సమీపంలో వేదవతి నది నుంచి గురువారం గోనెహాల్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సెబ్ అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గోనెహాల్‌లో కేంద్రం మంజూరు చేసిన గృహాలకు ఇసుక తరలిస్తున్నట్లు ట్రాక్టర్ డ్రైవర్ తెలిపారు. అయితే అందుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నార్పల : మండల కేంద్రంలో బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి విచారణ మేరకు బాలికపై అత్యాచారానికి పాల్పడిన సుధాకర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి

శింగనమల : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిఎస్ఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి సూచించారు. గురువారం మండల పరిధిలోని పెరవలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రోజూ తాము ఆహారంలో పిండి పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తద్వారా పిల్లలు, గర్భిణుల్లో పోషకాహార లోపం, రక్తహీనతను నివారించవచ్చన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పాలు, గుడ్లు, బియ్యం, బ్యాళ్లు, నూనె, ఖర్జూరాలు, అటుకులు, బాలామృతం, వేరుశనగ చిక్కిళు.., బెల్లం, రాగి పిండిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ప్రసన్న రాణి, గర్భిణులు, బాలింతలు, పిల్లలు తదితరులు

ఇసుక తరలింపు అడ్డగింత

పెద్దవడుగూరు : ఇసుక అక్రమ రవాణాను మండలంలోని కొండూరు గ్రామంలో టిడిపి నాయకులు గురువారం మరోసారి అడ్డుకున్నారు. ఇదే మండలం గంజిగుంటపల్లికి చెందిన వ్యక్తి ఇక్కడి పెన్నానది ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చాయంటూ ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గతవారంలో ఇలానే యంత్రాలతో ఇసుకను తరలిస్తుండగా టిడిపి నాయకులు అడ్డుకట్ట వేసిన విషయం తెలిసిందే. ఈనే పథ్యంలో మళ్లీ తవ్వకాలు ప్రారంభిస్తున్నారని సమాచారం తెలియడంతో టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు ఇటుకనాలు, రంగప్ప, సర్పంచి ఆదినారాయణ, ఆది, తదితరులు అడ్డుకుని ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. ఇక్కడి ఇసుకను తరలిస్తూ తమ గ్రామాలకు సరఫరా అయ్యే తాగునీటి బోర్లలో నీరు అడుగంటిపోయి తాగడానికి నీరు లభించని పరిస్థితి ఏర్పడుతుందని ఇసుకను తీసుకెళ్లరాదని హిటాచిని అడ్డుకుని ట్రిప్పర్లను వెనక్కి పంపారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు వితరణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ గట్టు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకన్న, ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, నిరంజన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన జాబ్‌మేళాలో కళాశాల చెందిన పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కస్టమర్ సర్వీస్ కంపెనీ (24 బై 7 ఎం 1) నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో ఇంజనీరింగ్, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలు, మౌలిక పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కస్టమర్ సర్వీస్ అడ్వైజర్, డిజిటల్ చాట్ అసోసియేషన్ ఎంపికైన వారికి రూ.3 నుంచి 3.5 లక్షల వరకూ వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు ప్రతినిధి సృజన తెలిపారు. ఎంపికైన వారిని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీ వాణి, ఎండి జి.రఘునాథరెడ్డి ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ప్లేస్మెంట్ అధికారి తన్వీర్ అభినందించారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నార్పల : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని సత్యసాయి ధ్యాన మండలిలో ఉన్న అనాథ శరణాలయంలో జనసేన నాయకులు కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ మాట్లాడుతూ 10ఏళ్లుగా దేశంలో నీతి, నిజాయితీతో నడుపుతున్న ఏకైక పార్టీ జనసేన అన్నారు. అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ తన విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని బడుగు, బలహీన వర్గాలు దగా పడుతుంటే, ఆడపిల్లలకి రక్షణ కరువై, స్వార్థ రాజకీయాలతో రాష్ట్రాన్ని నాశనం చేస్తుంటే.. చూడలేక పార్టీ పెట్టి నీతివంతమైన పాలన అందించాలని రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు తుపాకుల భాస్కర్, మండల ఉపాధ్యక్షులు ఉన్న తోట రామయ్య, వినోదంనారాయణస్వామి, షేక్ రహంతుల్లా, నీలూరి జయంతి, రాయదుర్గం తేజలక్ష్మి, గంజికుంట సోమనాథ్, రమణ, అనిల్, ఆలీ, వినోదం లోకేష్, గిరీష్, రమణయ్య, హరీష్, పవన్, సంగా అశోక్, కుళ్లాయప్ప, హరి, రాము, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానుల సమక్షంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రహమతుల్లా, యోగానంద, చింతా రామకృష్ణ, బాబావలి, ఇండ్ల గిరీష్, ప్రదీప్, కళ్యాణ్, అమీర్ ఖాన్, బన్నీ, విజయ్, నజీర్, శీనా, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రాజీనామా చేయాలి : ఆర్‌పిఎస్

అనంతపురం క్రైం : రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సిఎం జగన్ వెంటనే రాజీనామా చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను వైసిపి సోషల్ మీడియా ఆఫీస్‌గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పాలిట జగన్ ఓ విలన్‌గా మారిపోయారన్నారు. రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన ఎపిపిఎస్‌పిని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఇప్పుడు చివరకు చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా గ్రూప్ 1 ఉద్యోగాలను రద్దు చేసే విధంగా హైకోర్టుతో మొటిక్కాయలు వేయించుకోవడం రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీశారన్నారు. ముఖ్యమంత్రికి పాలన మీద పట్టు లేకపోవడంతో ఇలాంటి చర్యలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా పనికిరాడన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో నిరుద్యోగులకు నమ్మకం కలిగించే విధంగా ఎపిపిఎస్‌పిని ప్రక్షాళన చేయాలని గవర్నర్‌కి ఒక లేఖ కూడా అందచేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

కార్యకర్తల మృతికి నివాళి

పామిడి : అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిన మండల కేంద్రంలోని 4వ వార్డుకు చెందిన పంచాయతీ మాజీ వార్డు సభ్యులు ఆదినారాయణ మృతదేహానికి గుమ్మనూరు నారాయణ గురువారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆదినారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే ఆదినారాయణ మృతదేహానికి నియోజకవర్గ టిడిపి యువనాయకులు రామ్‌తేజగౌడ్ నివాళులర్పించారు.అలాగే మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆదినారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే 9వ వార్డులో మృతిచెందిన బోయ ఓబన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి, గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ మీసాల రామచంద్ర, ఓసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, కొండూరు బబ్లూ, బిఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట, గొర్ల సుంకన్న, కాలువగడ్డ రామంజి, ఎస్సీ సెల్ సీనా, సోషల్ మీడియా కో కన్వీనర్ సురేంద్ర, నాగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాతృమూర్తి మృతికి నివాళి

పామిడి : ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మాతృమూర్తి లలితమ్మ పార్థీవదేహానికి గుత్తి మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహా, నారాయణస్వామియాదవ్, 5వ వార్డు మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, బోరు పుల్లయ్య, పిసిఆర్ సోషల్ మీడియా నగేష్‌యాదవ్, సోషల్ మీడియా కో కన్వీనర్ పుల్లా సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి : ఎంపిడిఒ

బెలుగుప్ప : ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిదినాలు పూర్తయ్యే వరకూ కూలీలకు పనులు కల్పించాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 61 రోజుల నుంచి 99 రోజుల మధ్యలో ఉన్న జాబ్ కార్డు దారులకు 100 రోజులు పూర్తయ్యాలా పనులు కల్పించాలని సూచించారు. అలాగే వేతనదారుడు అకౌంట్‌కు, ఆధార్ లింకు చేయడం, ఎన్‌పిసిఐ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, తదితర అంశాలపై ఉపాధి సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారిణి భాగ్యలక్ష్మి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ జయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు సూర్యప్రకాష్, స్వాతి, విజయకుమార్, నాగేంద్రప్ప, కంప్యూటరు ఆపరేటర్లు నిర్మల, అనిల్‌కుమార్, శ్రీలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సిఎం జగన్




ఇంటి పట్టా అందజేస్తున్న నాయకులు

తాడిపత్రి : పేదల పక్షపాతి సిఎం జగన్ అని మాజీ మున్సిపల్ ఛైర్మన్ జాన్సన్ సూచించారు. గురువారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని లబ్ధిదారులకు జగనన్న ఇంటి స్థల హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చెప్పినట్టు ఇళ్లు లేని అక్కచెల్లెమ్మలకు వైఎస్ఆర్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇంటి స్థలం ఇంటి పట్టాలు అందజేసి శాశ్వత రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మనోజ్, కాశీ, సూర్య, ప్రభాకర్, బాబు, హనుమంతు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కోసం ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయాలి

అనంతపురం క్రైం : రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు వివిధవర్గాలకు డిక్లరేషన్లు ప్రకటించినట్లుగానే ఉద్యోగుల డిక్లరేషన్ ప్రకటించాలని ఎపి రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు ఏర్పడితే ఐదేళ్లలో ఉద్యోగుల కోసం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారో, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో, సమస్య పరిష్కారం కోసం ఎంతకాల వ్యవధి అవసరమో తదితర ప్రధాన వివరాలతో కూడిన ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు ప్రకటించిన డిక్లరేషన్‌ను ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలు నిబద్ధతతో అమలు చేస్తే ప్రధాన సమస్యలపై ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం తరచూ సమావేశాలు, చర్చలు, నిర్వహించాల్సిన అవసరం ఉండదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 11వ పిఆర్‌సి, డిఎ, ఎపిజి ఎల్ఐ, పిఎఫ్ బకాయిలు, సరెండర్ లీవ్స్, టిఎ అలవెన్స్ బకాయిలు వంటి సమస్యల పరిష్కారానికి దాదాపు రూ.18 వేల కోట్ల వరకూ చెల్లించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి




రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాము

నార్పల : మండలంలోని సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిడిఒ రాము, ఇఒఆర్‌డి శైలజారాణి సూచించారు. గురువారం మండల పరిధిలోని బండ్లపల్లి, సోదనపల్లి, నార్పల సచియాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయల్లో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. సమయానికి అనుగుణంగా విధులకు వచ్చి ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇకపోతే త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి సచివాలయ ఉద్యోగి అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేయాలన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల నిమిత్తం ఎక్కడికైనా వెళితే కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పామిడి : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంపిటేషన్ సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ని రుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని పెద్దాసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ భూమిరెడ్డి ఓబుళమ్మ పెద్దకర్మ 13వ రోజు సందర్భంగా కోడలు, ట్రస్టు సభ్యులు పవనకుమారి, కుమారుడు భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, సుబ్రమణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, ఓబుళపతి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


నూతన సచివాలయాలు ప్రారంభం

రాయదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం, పల్లేపల్లి సచివాలయాలను గురువారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ విద్యావతి, ఎంపీడీవో అల్లా బకష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గ్రానైట్ వితరణ

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ వద్ద ఉన్న బాట ఆంజనేయస్వామి ఆలయానికి గ్రానైట్ వ్యాపారి ఎం. రామాంజినేయులు ఉచితంగా గ్రానైట్ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ అర్చకుడు రామాంజినేయులు సంప్రదించగా గ్రానైట్ వ్యాపారి ఎం.రామాంజనేయులు మూడు చదరాల గ్రానైట్ బండలను అందజేశారు. కార్యక్రమంలో ఆల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా బాలకృష్ణ



శింగనమల : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా సోదనపల్లికి చెందిన కురబ చిక్కాల బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డితోపాటు మండలవ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా ఎంపిక చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.